సాక్షి
ఆదిలాబాద్
శనివారం, 13 జూలై, 2024



మొక్కలు భలే చౌక
ఐటీడీఏ ఉద్యానశాఖ మొక్కల విక్రయానికి సిద్ధమైంది. మామిడితోపాటు అలంకరణ మొక్కలను రైతులకు తక్కువ ధరకే అందుబాటులో ఉంచింది. 8లో▸



వ్యాధుల కాలం.. జర పైలం
వానాకాలంలో అపరిశుభ్రత కారణంగా దోమలు వృద్ధి చెందుతాయి. జనం వ్యాధుల బారిన పడుతుంటారు. ఈమేరకు అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. 9లో▸



వాతావరణం
ఆకాశం మేఘావృతమై ఉంటుంది. గాలిలో తేమశాతం పెరగనుంది. పలుచోట్ల ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

క్రీడా పోటీలు పకడ్బందీగా నిర్వహిస్తాం



మాట్లాడుతున్న డీఈవో ప్రణీత

ఆదిలాబాద్‌: 2024–25 విద్యా సంవత్సరానికి గాను స్కూల్‌ గేమ్స్‌ ఫెడరేషన్‌ ఆధ్వర్యంలో పాఠశాల క్రీడా పోటీలను పకడ్బందీగా నిర్వహిస్తామని డీఈవో ప్రణీత తెలిపారు. జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో శుక్రవారం నిర్వహించిన ఎస్జీఎఫ్‌ సమావేశానికి ఆమె హాజరై మాట్లాడారు. త్వరలో స్పోర్ట్స్‌ క్యాలెండర్‌ విడుదల చేస్తామని వెల్లడించారు. అలాగే రాష్ట్రస్థాయి పోటీల నిర్వహణకు సంబంధించి ప్రతిపాదనలు ఈనెల 20లోపు అందజేయాలన్నారు. వ్యాయామ ఉపాధ్యాయులు క్రీడా పోటీలు విజయవంతమయ్యేలా కృషి చేయాలని సూచించారు. ఇందులో జిల్లా గిరిజన క్రీడల అధికారి పార్థసారథి, ఎస్జీఎఫ్‌ కార్యదర్శి కాంతారావు, పెటా ప్రధాన కార్యదర్శి స్వామి, పీఈటీ రాజేశ్‌ తదితరులున్నారు

సేంద్రియ ఎరువు తయారు చేయాలి



రికార్డులు పరిశీలిస్తున్న డీపీవో శ్రీలత

నేరడిగొండ: జీపీల్లో సేంద్రియ ఎరువు తయారు చేయాలని జిల్లా పంచాయతీ అధికారి శ్రీలత అన్నారు. మండలంలోని వడూర్‌ గ్రామపంచాయతీలో శుక్రవారం ఆమె పర్యటించారు. సెగ్రిగేషన్‌ షెడ్‌తో పాటు నర్సరీలో మొక్కల తీరును పరిశీలించారు. అనంతరం పంచాయతీ కార్యాలయంలో రికార్డులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతీ పంచాయతీలో సేంద్రియ ఎరువు తయారు చేయాలని సూచించారు. వర్షాకాలం కావడంతో గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణ చర్యలు చేపట్టాలన్నారు. ఆమె వెంట పంచాయతీ కార్యదర్శి నర్సారెడ్డి, గ్రామస్తులు ఉన్నారు.

మొక్కలు నాటి సంరక్షించాలి



కార్యక్రమంలో పాల్గొన్న హిమశ్రీ

తాంసి: పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని జిల్లా ఎక్సైజ్‌ సూపరింటెండెంట్‌ హిమశ్రీ అన్నారు. మండల కేంద్రంలో ఆ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం వన మహోత్సవం నిర్వహించారు. ఇందులో భాగంగా స్థానిక ఈత వనంలో గౌడ కులస్తులు, ఎక్సైజ్‌ అధికారులతో కలిసి ఆమె మొక్కలు నాటారు. ఎక్సైజ్‌శాఖ ఆధ్వర్యంలో ఏటా మొక్కలు నాటడం ఆనవాయితీగా కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో ఎక్సైజ్‌ ఇన్‌స్పెక్టర్‌ విజేందర్‌, సబ్‌ ఇన్‌స్పెక్టర్‌ వైద్య, మోకుదెబ్బ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్‌, కుమార్‌ గౌడ్‌, శిరీష్‌గౌడ్‌, హరీశ్‌గౌడ్‌ సిబ్బంది పాల్గొన్నారు.

ఓటమిపై పోస్టుమార్టం

- కాంగ్రెస్‌ గెలిచే సీటు ఎందుకు ఓడిపోవాల్సి వచ్చింది
- అధిష్టానం నుంచి వచ్చిన కురియన్‌ కమిటీ ఆరా
- భేటీ అయిన ఆదిలాబాద్‌ అభ్యర్థి సుగుణ



సుగుణ

సాక్షి, ఆదిలాబాద్‌: 'పార్లమెంట్‌ ఎన్నికల్లో ఆదిలాబాద్‌ స్థానం కాంగ్రెస్‌ పార్టీ గెలుస్తుందని ముందు నుంచి అంచనాల్లో ఉన్నాం.. ఇక్కడ రాహుల్‌గాంధీ, రేవంత్‌రెడ్డి పర్యటించారు.. అసెంబ్లీ నియోజకవర్గాల్లోనూ ముఖ్య నేతలు పార్టీలో చేరారు.. బీఆర్‌ఎస్‌ ఓటు కాంగ్రెస్‌కు పడుతుందని అనుకున్నప్పటికీ పూర్తిస్థాయిలో ఎందుకు జరగలేదు.. గెలిచే సీటు ఎందుకు ఓడిపోయాం..' ఇది కాంగ్రెస్‌ పార్టీ అధిష్టానం నుంచి వచ్చిన కురియన్‌ కమిటీ సంధించిన ప్రశ్నలు. రాష్ట్రంలో ఆశించిన స్థాయిలో పార్లమెంట్‌ సీట్లు ఎందుకు రాలేకపోయాయి అనే అంశంపై ఈ కమిటీని అధిష్టానం నియమించింది. ఈ నేపథ్యంలో కమిటీ హైదరాబాద్‌కు విచ్చేసింది. రాష్ట్రంలో గెలిచిన, ఓటమిపాలైన అభ్యర్థులు రాజ్యసభ మాజీ డిప్యూటీ చైర్మన్‌ కురియన్‌తో భేటీ అవుతూ వస్తున్నారు. గురువారం ఈ కమిటీతో కాంగ్రెస్‌ పార్లమెంట్‌ అభ్యర్థి ఆత్రం సుగుణ భేటీ అయ్యారు.

నెగెటివ్‌ అంశాలపై దృష్టి సారించకపోవడంతోనే..

ఆదిలాబాద్‌ పార్లమెంట్‌ నియోజకవర్గంలో కాంగ్రెస్‌కు ఈ సారి గణనీయంగా ఓట్లు పడతాయని ఆ పార్టీ ముందు నుంచి అంచనా వేస్తూ వచ్చింది. ఈ ఎన్నికలకు పార్టీ ఇన్‌చార్జిగా వ్యవహరించిన సీతక్క విస్తృతంగా పర్యటించారు. అలాగే పీసీసీ ప్రధాన కార్యదర్శి సత్తు మల్లేశ్‌ ఇక్కడి నుంచి పార్టీ అభ్యర్థి గెలుపును ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. అయితే అసెంబ్లీ నియోజకవర్గాల్లో ముఖ్యనేతలు వ్యవహరించిన తీరుపై కమిటీ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా ఎన్నికల సమయంలో ఆయా నియోజకవర్గాల్లో కేవలం పాజిటివ్‌ అంశాలను తమ దృష్టికి తీసుకొచ్చి, నెగెటివ్‌ అంశాలను పట్టించుకోలేదన్న అభిప్రాయం వ్యక్తమవుతుంది. ఈ నేపథ్యంలోనే కొన్ని నియోజకవర్గాల్లో పార్టీకి ముందుగా అనుకున్నట్టుగా ఓట్లు రాలేదనే అభిప్రాయం వ్యక్తమవుతుంది. ప్రధానంగా సీతక్క, మల్లేశ్‌ ఆయా నియోజకవర్గాలపై దృష్టి సారించినప్పటికీ ముఖ్య నేతలు నెగెటివ్‌ అంశాలను వారి దృష్టికి తీసుకురాలేక పోయారని అంటున్నారు. దీంతోనే ఒక్క ఆసిఫాబాద్‌ మినహా మిగతా అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో కాంగ్రెస్‌కు ముందుగా అనుకున్నట్టుగా ఓట్లు రాలేదనే అభిప్రాయానికి వచ్చినట్లు తెలుస్తుంది. ఈ విషయంలో కొంత మంది నియోజకవర్గ ముఖ్య నేతల తీరుపై కమిటీకి ఫిర్యాదు చేశారని సమాచారం.

స్పందన ఎలా ఉంటుందో..

ఆదిలాబాద్‌ పార్లమెంట్‌ స్థానంలో కాంగ్రెస్‌ పార్టీ ఓటమికి సంబంధించి వివరాలు ఆరా తీసిన కురియన్‌ కమిటీ ఇక ఎలా స్పందిస్తుందనేది చూడాల్సిందే. దీనిపై వారు అధిష్టానానికి నివేదిక ఇవ్వనుండగా, దాని తర్వాత ఎలాంటి చర్యలు ఉంటాయనేది ప్రస్తుతం పార్టీలో చర్చ నడుస్తోంది. ముఖ్యంగా అసెంబ్లీ నియోజకవర్గాల్లో కొంత మంది ముఖ్య నేతలు వ్యవహరించిన తీరుపై పార్టీ పరంగా ఎలా స్పందిస్తారనేది చూడాల్సిందే.

ముఖ్యనేతలు చేరినా..

నిర్మల్‌లో బీఆర్‌ఎస్‌ నుంచి మాజీ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, సీనియర్‌ నేతలు వేణుగోపాలాచారి, ముధోల్‌ మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి, సిర్పూర్‌ మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప వంటి వారు చేరినప్పటికీ ఎందుకు ప్రభావం చూపలేకపోయారని కమిటీ ప్రశ్నించింది. అయితే ఈ నేతలు చివరలో చేరడంతో ఆ ఓటు పూర్తి స్థాయిలో బదిలీ కాలేదని చెప్పినట్లు తెలుస్తోంది. అంతే కాకుండా అసెంబ్లీ ఎన్నికల తర్వాత పార్లమెంట్‌ ఎన్నికల పరంగా కాంగ్రెస్‌, బీజేపీ మధ్య పోటీ ఎదురైందని, బీఆర్‌ఎస్‌ ఓటు కాంగ్రెస్‌ వైపు మళ్లుతుందని అనుకున్నప్పటికీ ఆ పార్టీ బీజేపీతో కుమ్మక్కు కావడంతో పూర్తిస్థాయిలో ఓట్లు కాంగ్రెస్‌కు పడలేదని కమిటీ దృష్టికి తీసుకెళ్లారు. దీంతోపాటు ముఖ్య నేతలు, వారి అనుచరులు పార్టీలో చేరినప్పటికీ బీఆర్‌ఎస్‌కు చెందిన క్యాడర్‌ పూర్తిగా కాంగ్రెస్‌లోకి రాకపోవడం కూడా మైనస్‌ అయ్యిందని చెప్పుకొచ్చినట్లు సమాచారం. ఈ పరిస్థితుల్లో బీఆర్‌ఎస్‌ ఓటు బీజేపీకి మళ్లిందని చెప్పారు.

జీపీల ఖజానా ఖాళీ!

- విడుదల కాని ఎస్‌ఎఫ్‌సీ, ఎఫ్‌ఎఫ్‌సీ నిధులు
- పేరుకుపోతున్న ట్రాక్టర్‌ కిస్తీలు
- కార్మికులకు నెలల తరబడి అందని వేతనాలు
- లబోదిబోమంటున్న పంచాయతీ కార్యదర్శులు



కుంటాల గ్రామ పంచాయతీ కార్యాలయం

కైలాస్‌నగర్‌: పంచాయతీల్లో పైసల్లేకుండా పోయాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి నెలల తరబడి నిధులు విడుదల కాకపోవడంతో జీపీల ఖజానా నిండుకుంది. ఓ వైపు ట్రాక్టర్ల కిస్తీలు పేరుకుపోతుండగా.. మల్టీపర్పస్‌ కార్మికులకు నెలల తరబడి జీతాలివ్వలేని దుస్థితి. ప్రత్యేకాధికారుల పాలన అస్తవ్యస్తంగా తయారైంది. ఆదాయం కలిగిన, మేజర్‌ జీపీలను మినహాయిస్తే చిన్న పంచాయతీల్లో పాలన కార్యదర్శులకు పెను భారంగా మారుతోంది. అత్యవసరమైన పారిశుధ్యం, తాగునీటి అవసరాల కోసం కార్యదర్శులు తమ జేబుల్లో నుంచి సర్దుబాటు చేస్తున్నప్పటికీ నెలల తరబడి బిల్లులు రాకపోవడంతో వారు కూడా చేతులెత్తేస్తున్నారు.

గడువుకు ముందే నిండుకున్న ఖజానా..

పదవీకాలం ముగియకముందే తమకు రావాల్సిన బిల్లులకు సంబంధించి ఖజానాలో ఉన్న డబ్బులను సర్పంచ్‌లు ఖాళీ చేశారు. సాధారణంగా పంచాయతీల్లో పన్నులను మార్చి నెలాఖరులో వసూలు చేస్తారు. అయితే పాలకవర్గాల పదవీకాలం ముగియనుండటంతో మెజార్టీ గ్రామాల్లో ఈ సారి ముందుగానే పన్నులు వసూలు చేశారు. వచ్చిన డబ్బులను పంచాయతీ అవసరాలకు వెచ్చించారు. కొంతమంది సర్పంచ్‌లు పంచాయతీ అవసరాల కోసం వెచ్చించిన సామగ్రికి సంబంధించి బిల్లులు పెట్టి డబ్బులు తీసుకున్నారు. మరికొందరి బిల్లులు ఇప్పటికీ పెండింగ్‌లో ఉండటంతో వారు ట్రెజరీ చుట్టు తిరగాల్సి వస్తోంది. జీపీలకు ప్రత్యేకాధికారులను నియమించినప్పటికీ వారు చుట్టపు చూపుగా వచ్చి వెళుతున్నారనే విమర్శలున్నాయి. బాధ్యత అంతా పంచాయతీ కార్యదర్శులే మోయాల్సి వస్తోంది.

నిలిచిన నిధుల విడుదల

జిల్లాలో 468 గ్రామ పంచాయతీలున్నాయి. వీటి పరిధిలో 5,53,245 మంది జనాభా ఉంది. ఒక్కొక్కరికి రూ.1,604 చొప్పున ఎస్‌ఎఫ్‌సీ, ఎఫ్‌ఎఫ్‌సీ కలిపి జిల్లాకు ప్రతినెలా రూ.88కోట్ల74లక్షల 4వేల 980 నిధులు అందేవి. ఇందులో రాష్ట్ర ఆర్థిక సంఘ నిధులను (ఎస్‌ఎఫ్‌సీ) ప్రభుత్వం ప్రతి నెలా విడుదల చేసేది. కేంద్రానికి సంబంధించి 15వ ఆర్థిక సంఘం నిధులు (ఎఫ్‌ఎఫ్‌సీ) ప్రతి మూడు నెలలకోసారి విడుదల చేసేది. అయితే రాష్ట్ర ప్రభుత్వం గతేడాది అక్టోబర్‌లో రూ.67కోట్ల 26లక్షల 40వేల 654లను విడుదల చేసింది. ప్రతి నెలా విడుదల కావాల్సిన ఈ నిధులు పది నెలలుగా నిలిచిపోయాయి. ఇక కేంద్రానికి సంబంధించి ఈ ఏడాది మార్చిలో రూ.76,18,049లను విడుదల చేసినట్లు అధికారులు చెబుతున్నా ఆ నిధులు పంచాయతీల ఖాతాల్లో జమకాలేదని కార్యదర్శులు అంటున్నారు. ఇలా రాష్ట్ర నిధులు పది నెలలుగా, కేంద్ర నిధులు ఏడు నెలలుగా అందకపోవడంతో పంచాయతీల్లో ఎలాంటి పనులు చేపట్టలేని పరిస్థితి.

పల్లెపాలనకు ఇక్కట్లు

ఆదాయం కలిగిన కొన్ని పంచాయతీలను మినహాయిస్తే 500లోపు జనాభా కలిగిన జీపీల పాలనకు ఇబ్బందులు తప్పడం లేదు. చిన్న జీపీల్లో పనిచేసే కార్మికులకు మూడు, నాలుగు నెలలుగా జీతాలు ఇవ్వడం లేదు. నీటిసరఫరా, పారిశుధ్య కార్మికులు పనులు చేసేందుకు మొండికేస్తున్నారు. విధిలేని పరిస్థితుల్లో కార్యదర్శులు తమ జేబుల్లో నుంచి వేతనాలు చెల్లించాల్సి వస్తోంది. అలాగే వీధి దీపాల బిల్లుల చెల్లింపు, తాగునీటి పథకాల నిర్వహణ, మోటార్ల మరమ్మతు వంటివి అత్యవసర పనులే. వాటికి కార్యదర్శులు తమ జేబుల్లో నుంచి సర్దుబాటు చేస్తున్నారు. ఇలా ప్రతీది తమ జేబుల్లోంచి చెల్లించాల్సి వస్తుండడంతో కార్యదర్శులు లబోదిబోమంటూ చేతులెత్తేస్తున్నారు. ప్రభుత్వాలు ఇప్పటికైనా నిధులు విడుదల చేయాలని కోరుతున్నారు.

ఇబ్బందుల్లేకుండా చూస్తున్నాం



పంచాయతీల్లో నిధుల కొరత ఉన్న మాట వాస్తవమే. కేంద్ర, రాష్ట్ర ఆర్థిక సంఘం నిధుల విడుదలలో జాప్యం అయింది. అయినప్పటికీ గ్రామాల్లో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నాం. పారిశుధ్య నిర్వహణ, తాగునీటి సరఫరాకు ఎలాంటి సమస్య రాకుండా చూడాలని కార్యదర్శులను ఆదేశించాం. పంచాయతీల్లో ఉన్న ఆర్థిక వనరుల ప్రకారంగా కార్మికుల వేతనాలను సర్దుబాటు చేస్తున్నాం.

– శ్రీలత, జిల్లా పంచాయతీ అధికారి

'అమ్మ ఆదర్శ' పనులు పూర్తి చేయాలి

- కలెక్టర్‌ రాజర్షిషా

కైలాస్‌నగర్‌: అమ్మఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా చేపడుతున్న పనులను త్వరితగతిన పూర్తయ్యేలా శ్రద్ధ వహించాలని కలెక్టర్‌ రాజర్షి షా అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌ సమావేశ మందిరంలో ఆర్‌ అండ్‌బీ టీజీఈడబ్ల్యూఐడీసీ అధికారులతో శుక్రవారం సమీక్ష నిర్వహించారు. వర్షాల నేపథ్యంలో కోతకు గురైన రహదారుల వివరాలు, అమ్మ ఆదర్శ పాఠశాలల నిర్మాణ పనుల తీరును సమీక్షించారు. వివిధ దశల్లో ఉన్న వాటి పురోగతిని వేగవంతం చేయాలని ఆదేశించారు. ఆదిలాబాద్‌ నుంచి కెరమెరి, హస్నాపూర్‌ నుంచి ఎల్లాపూర్‌, రాంపూర్‌ నుంచి నిప్పాని ఎక్స్‌రోడ్‌ వరకు గల పనులపై సమీక్షించారు. రోడ్లు చెడిపోయిన వివిధ మండలాల పరిధిలోని లోవెల్‌ బ్రిడ్జిలు ఇతర అంశాలపై సమీక్షించి పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. సమావేశంలో ఆర్‌అండ్‌బీ ఈఈ నర్సయ్య, పీఆర్‌ ఈఈ రాథోడ్‌ భీంరావు, డీడబ్ల్యూవో సబిత, డీఈవో ప్రణీత, ఈఈ అశోక్‌ పాల్గొన్నారు.

రిమ్స్‌లో మహిళా శక్తి క్యాంటీన్‌

- ప్రారంభోత్సవానికి సీఎం రాక
- కలెక్టర్‌ రాజర్షిషా వెల్లడి



రిమ్స్‌లో అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్‌

ఆదిలాబాద్‌టౌన్‌: మహిళా శక్తి పథకం కింద రిమ్స్‌ ఆస్పత్రిలో మహిళా శక్తి క్యాంటీన్‌ ఏర్పాటు చేయనున్నట్లు కలెక్టర్‌ రాజర్షిషా తెలిపారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలోని రిమ్స్‌ ఆవరణలో శుక్రవారం స్థల పరిశీలన చేశారు. ప్రణాళికలు తయారు చేయాలని డీఆర్డీవోను ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్‌ మాట్లాడుతూ.. బ్యాంకు ద్వారా రుణం మంజూరైందని, ఫర్నిచర్‌ సిద్ధంగా ఉందని పేర్కొన్నారు. క్యాంటీన్‌ ప్రారంభోత్సవానికి ముఖ్యమంత్రి జిల్లాకు వస్తున్నట్లు తెలిపారు. ఇందుకోసం ఏర్పాట్లు చేస్తున్నామని పేర్కొన్నారు. అనంతరం సదరం క్యాంప్‌ను సందర్శించారు. వెయిటింగ్‌ లిస్టు వివరాలు తెలుసుకున్నారు. పెండింగ్‌లో ఉండకుండా అర్హులైన వారికి సర్టిఫికెట్‌ అందించాలని డైరెక్టర్‌ జైసింగ్‌ రాథోడ్‌ను ఆదేశించారు. అలాగే రిమ్స్‌లో మందుల కొరత లేకుండా చూడాలన్నారు. ఆయన వెంట డీవైఎస్‌వో వెంకటేశ్వర్లు, డీఆర్డీవో సాయన్న, రిమ్స్‌ సూపరింటెండెంట్‌ అశోక్‌ తదితరులున్నారు.

పారిశుధ్య నిర్వహణపై అప్రమత్తంగా ఉండాలి

దోమలు వృద్ధి చెందకుండా ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు పారిశుధ్య నిర్వహణపై అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్‌ రాజర్షిషా అధికారులను ఆదేశించారు. డ్రైడేలో భాగంగా పట్టణంలోని మహాలక్ష్మివాడ, చిల్కూరి లక్ష్మినగర్‌లో శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఇంటింటికీ తిరుగుతూ కరపత్రాలు అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్‌ మాట్లాడుతూ.. సీజనల్‌ వ్యాధులపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. పరిసరాల, వ్యక్తిగత శుభ్రతతో వ్యాధులు దరిచేరవని పేర్కొన్నారు. అనంతరం మహాలక్ష్మివాడ పాఠశాలను సందర్శించారు. తరగతి గదుల్లోకి వెళ్లి విద్యార్థులకు సీజనల్‌ వ్యాధుల వ్యాప్తి, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఆయన వెంట డీఎంహెచ్‌వో నరేందర్‌ రాథోడ్‌, మున్సిపల్‌ కమిషనర్‌ ఖమర్‌ అహ్మద్‌, జిల్లా మలేరియా అధికారి శ్రీధర్‌, శానిటరి ఇన్‌స్పెక్టర్‌ నరేందర్‌, పాఠశాల హెచ్‌ఎం కిషన్‌ తదితరులున్నారు.

'స్పోర్ట్స్‌'కు పైరవీలు!

- పోస్టింగ్‌ బడిపై ఉపాధ్యాయుల అనాసక్తి
- క్రీడా పాఠశాలలో డిప్యూటేషన్‌కు యత్నాలు
- పలు సంఘాల నాయకులదే కీలక పాత్ర
- నిబంధనలకు తిలోదకాలు.. అధికారులపై తీవ్ర ఒత్తిడి



జిల్లా కేంద్రంలోని స్పోర్ట్స్‌ స్కూల్‌

ఆదిలాబాద్‌టౌన్‌: కొంత మంది ఉపాధ్యాయులు తమ పోస్టింగ్‌ చోట పనిచేయకుండా డిప్యూటేషన్‌పై వారికి అనుకూలంగా ఉన్న పని చేసేందుకు ఆసక్తి కనబర్చుతున్నారు. ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులతో విద్యాశాఖ అధికారులకు ఫోన్‌ చేయించి ఒత్తిడి తెస్తున్నారు. ఏకంగా సీఎంవో నుంచే ఫోన్‌లు చేయిస్తున్నారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. జిల్లా కేంద్రంలోని స్పోర్ట్స్‌ స్కూల్‌లో పనిచేసేందుకు పలువురు ఎక్కువగా మొగ్గు చూపుతున్నారు. కొన్ని ఉపాధ్యాయ సంఘాల నాయకుల మద్దతుతో అధికారులు తలొగ్గి వారు చెప్పిన వారికే డిప్యూటేషన్‌ కేటాయిస్తున్నారు. ఇటీవల ఉపాధ్యాయ సంఘాలతో అధికారులు నిర్వహించిన సమావేశంలోనూ పైరవీ అనుకూల, వ్యతిరేక సంఘాల నాయకుల మధ్య గొడవ జరిగినట్లు సమాచారం.

పైరవీల జోరు..

జిల్లా కేంద్రంలోని స్పోర్ట్స్‌ స్కూల్‌లో డిప్యూటేషన్‌పై ఉపాధ్యాయులు పనిచేసేందుకు గాను విద్యాశాఖ ఏటా నోటిఫికేషన్‌ జారీ చేస్తుంది. ఎక్కడైతే విద్యార్థుల సంఖ్యకు మించి ఉపాధ్యాయులు పనిచేస్తున్నారో వారిని మాత్రమే ఇక్కడ కేటాయించాల్సి ఉంటుంది. అయితే ఆ నిబంధనను తుంగలో తొక్కి ఉపాధ్యాయులు దరఖాస్తు చేసుకోగా, వారికి సంఘ బాధ్యులు, అధికారులు వంతపాడుతున్నారనే విమర్శలున్నాయి. వారికి కేటాయించిన పాఠశాలల్లో బోధించాల్సి ఉండగా, దూరభారం, వ్యాపారాలు, ఇతర పనులు చేసుకునేందుకు వెసులుబాటు కోసం స్పోర్ట్స్‌ స్కూల్‌పై మక్కువ చూపుతున్నట్లు తెలుస్తోంది. ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, కుల, ఉపాధ్యాయ సంఘాల నాయకుల మద్దతు ద్వారా పైరవీలు చేయిస్తున్నారు.ఈ క్రమంలో అధికారులు వారు చెప్పిన వారికే డిప్యూటేషన్‌ ఇస్తున్నారు.

సంఘాల నాయకులది అదే తీరు..

ఉపాధ్యాయ సంఘాల నాయకులు కొందరు వారి స్వార్థ ప్రయోజనాల కోసం విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడుతున్నారు. విద్యాశాఖ తప్పిదాలను బయట పెట్టి సరిదిద్దాల్సిన వారే సంఘ సభ్యులకు మేలు జరిగేలా ఒప్పందాలు కుదుర్చుకొని అధికారుల తప్పిదాలకు వంత పాడుతున్నారు. స్పోర్ట్స్‌ స్కూల్‌లో ఇదే పరిస్థితి ఉందనే ప్రచారం సాగుతుంది.

నిబంధనల ప్రకారమే డిప్యూటేషన్లు..

స్పోర్ట్స్‌ స్కూల్‌లో 11 పోస్టుల కోసం నోటిఫికేషన్‌ జారీ చేశాం. 12 మంది టీచర్లు దరఖాస్తు చేసుకున్నారు. వారు పనిచేసే పాఠశాలల్లో సర్‌ప్లస్‌ ఉంచి మండల విద్యాధికారి, ప్రధానోపాధ్యాయులు నోఆబ్జెక్షన్‌ ఇస్తేనే డిప్యూటేషన్‌ కేటాయిస్తాం. నిబంధనల ప్రకారమే స్పోర్ట్స్‌ స్కూల్‌లో డిప్యూటేషన్ల కేటాయింపు ఉంటుంది. ఎలాంటి అక్రమాలు జరగడం లేదు.

– ప్రణీత, డీఈవో

- జిల్లా కేంద్రంలోని స్పోర్ట్స్‌ స్కూల్‌లో డిప్యూటేషన్‌పై పనిచేసేందుకు ఈనెల 2న విద్యాశాఖ నోటిఫికేషన్‌ జారీ చేసింది. 11 పోస్టులకు సంబంధించి 12 మంది దరఖాస్తు చేసుకున్నారు. స్కూల్‌ అసిస్టెంట్‌ సాంఘిక శాస్త్రం మినహా మిగతా వాటికి దరఖాస్తులు వచ్చాయి.

ఇదీ సంగతి..

- ఇంగ్లిష్‌ సబ్జెక్ట్‌ కోసం బేల మండలానికి చెందిన ఓ ఉపాధ్యాయుడు ఏకంగా సీఎంవో కార్యాలయం నుంచి విద్యాశాఖ అధికారులకు ఫోన్‌ చేయించారు.
- ఫిజికల్‌ సైన్స్‌కోసం ఇద్దరు ఉపాధ్యాయులు దరఖాస్తులు చేసుకున్నారు. ఇందులో ఒకరు బజార్‌హత్నూర్‌ మండలం, మరొకరు తలమడుగు మండలం నుంచి ఉన్నారు. తలమడుగు మండలానికి చెందిన ఉపాధ్యాయుడు పాత ఎన్‌వోసీ సమర్పించాడు. విషయాన్ని సంబంధిత అధికారులు గుర్తించారు.
- భీంపూర్‌ మండలానికి చెందిన ఓ టీచర్‌ ఓ ప్రజాప్రతినిధిని పైరవీ కోసం ఆశ్రయించగా, ఆయన నిరాకరించినట్లు తెలిసింది. సంబంధిత ఎంఈవో నో ఆబ్జెక్షన్‌ సర్టిఫికెట్‌ ఇవ్వకపోయినా స్పోర్ట్స్‌ స్కూల్‌లో పనిచేసేందుకు దరఖాస్తు చేసుకోవడం గమనార్హం.
- బేల మండలానికి చెందిన ఓ ఇంగ్లిష్‌ ఉపాధ్యాయుడు స్పోర్ట్స్‌ స్కూల్‌లో డిప్యూటేషన్‌పై పనిచేసేందుకు డీఈవో కార్యాలయంలోని ఇన్‌ వార్డులో దరఖాస్తు చేసుకున్నాడు. ఆయన పేరు లేకపోవడంతో బుధవారం అధికారుల తీరుపై మండిపడ్డాడు. విషయాన్ని కలెక్టర్‌ దృష్టికి తీసుకెళ్లడంతో అధికారులు ఆ ఉపాధ్యాయుడిని బుజ్జగించి పోస్టింగ్‌ ఇచ్చేందుకు గ్రీన్‌ సిగ్నల్‌ ఇచ్చారు.
- జిల్లాకు చెందిన ఓ టీచర్‌ కుమురంభీం ఆసిఫాబాద్‌లో పనిచేస్తున్నారు. జిల్లా ఉన్నతాధికారి ఎండార్స్‌మెంట్‌తో స్పోర్ట్స్‌ స్కూల్‌లో పనిచేసేందుకు దరఖాస్తు చేసుకున్నారు. ఆ టీచర్‌ ఓ జిల్లా అధికారి బంధువు కావడంతో స్పోర్ట్స్‌ స్కూల్‌ కోసం పైరవీ చేస్తున్నారు.

నార్నూర్‌లో 20మంది విద్యార్థులకు అస్వస్థత

- ఏకలవ్య, ఆదర్శ, బాలుర ఆశ్రమ పాఠశాలల విద్యార్థులకు శ్వాసకోశ సమస్య
- స్థానిక సీహెచ్‌సీలో ప్రథమ చికిత్స
- నలుగురిని ఉట్నూర్‌ ఆసుపత్రికి తరలింపు



కార్తీకకు బెలూన్‌ ద్వారా ఆక్సిజన్‌ అందిస్తున్న సిబ్బంది



108లో విద్యార్థులను ఉట్నూర్‌ ఆసుపత్రికి తరలిస్తున్న సిబ్బంది

నార్నూర్‌: శ్వాసకోశ సమస్యతో 20 మంది విద్యార్థులు అస్వస్థతకు గురైన ఘటన మండల కేంద్రంలో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. స్థానిక ఏకలవ్య మోడల్‌ రెసిడెన్షియల్‌ పాఠశాలకు చెందిన దాదాపు 17 మంది, ఆదర్శ పాఠశాలకు చెందిన ఇద్దరు, బాలుర ఆశ్రమ పాఠశాల చెందిన ఓ విద్యార్థి తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. ఇందులో పలువురికి గతంలోనే శ్వాసకోశ సమస్య ఉన్నట్లు తెలిసింది. ఆయా పాఠశాలల్లో సాయంత్రం నుంచి ఒక్కొక్కరుగా విద్యార్థులు శ్వాస తీసుకునేందుకు ఇబ్బంది పడ్డారు. వెంటనే సిబ్బంది వారిని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స అందించారు. ఇందులో ఏకలవ్య పాఠశాలకు చెందిన విద్యార్థులు రాథోడ్‌ కార్తీక (8వ తరగతి), సీహెచ్‌ హర్షిక (8వ తరగతి), ఆదర్శ పాఠశాలకు చెందిన కావేరి(ఇంటర్‌ సెకండియర్‌)తో పాటు ఆశ్రమ పాఠశాలకు చెందిన ఎస్‌ రవి(మూడో తరగతి)ని మెరుగైన వైద్యం కోసం 108లో ఉట్నూర్‌ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మిగతా వారు సీహెచ్‌సీలో చికిత్స పొందుతున్నారు. కాగా, ఆసుపత్రిలో స్టాఫ్‌నర్సులు తప్ప వైద్యులు లేకపోవడంపై స్థానికులు ఆందోళనకు దిగారు. ఆసుపత్రి ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. ఆక్సిజన్‌ సిలిండర్లు సైతం అందుబాటులో లేకపోవడంపై మండిపడ్డారు. ఏటా వర్షాకాలం, చలికాలంలో పలువురు విద్యార్థులు ఇలా శ్వాస సంబంధిత సమస్యతో బాధపడుతున్నారని, ఈ సారి కూడా పునరావృతం అయినట్లు ఉపాధ్యాయులు పేర్కొన్నారు. సమాచారం అందుకున్న పులువురు విద్యార్థుల తల్లిదండ్రులు ఆస్పత్రికి చేరుకున్నారు. విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించేలా చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

'రామన్న, శంకర్‌ ఇద్దరూ ఒక్కటే'



మాట్లాడుతున్న భోజారెడ్డి


కైలాస్‌నగర్‌: ఆదిలాబాద్‌ మున్సిపల్‌ వైస్‌చైర్మన్‌ అవిశ్వాస తీర్మానం విషయంలో బీఆర్‌ఎస్‌, బీజేపీ కుమ్మక్కు రాజకీయాలు చేస్తున్నాయని డీసీసీబీ చైర్మన్‌ అడ్డి భోజారెడ్డి ఆరోపించారు. పట్టణంలోని ప్రజాసేవాభవన్‌లో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తమ నాయకుడు కంది శ్రీనివాసరెడ్డి ఆరోపించినట్లు మాజీ మంత్రి రామన్న, ఎమ్మెల్యే పాయల్‌ శంకర్‌ ఇద్దరూ ఒక్కటేననే విషయం ఇప్పుడు రుజువైందన్నారు. దీన్ని ప్రజలు గమనించాలని కోరారు. ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యే ఏ వ్యవహారమైనా కలిసే చేస్తారన్నారు. భూములు, రియల్‌ దందాల్లో ఇద్దరి భాగస్వామ్యం ఉంటుందన్నారు. కార్యక్రమంలో నాయకులు ఆశమ్మ, నర్సింగ్‌, శ్రీనివాస్‌, లక్ష్మణ్‌,సంతోష్‌, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

బైక్ దొంగల హల్‌చల్?

బోథ్: బోథ్ ఎక్స్‌రోడ్డు వద్ద బైక్ దొంగలు హల్‌చల్ చేస్తున్నారు. మండలానికి చెందిన ప్రయాణికులు బోథ్ ఎక్స్‌రోడ్డు వద్ద బైక్‌లు నిలిపి బస్సులో ఆదిలాబాద్, నిర్మల్ వెళ్తుంటారు. మండల కేంద్రానికి చెందిన ఓ అధ్యాపకుడు శుక్రవారం బోథ్ ఎక్స్‌రోడ్డు వద్ద బైక్ నిలిపి బస్సులో ఆదిలాబాద్ వెళ్లాడు. తిరిగివచ్చాక బైక్ చూస్తే హ్యాండిల్ వంకరగా, ప్లగ్ తీసేసి ఉంది. ఎవరో బైక్‌ను దొంగలించడానికి యత్నించినట్లు తెలిసింది. గతవారం ఓ వ్యక్తికి చెందిన బైక్ ప్లగ్ తీసి ఉండటం, ఒక చోట బైక్ పెడితే, మరో చోట ఉంది.

వరద గేటుకు కౌంటర్ వెయిట్ బిగింపు



పరిశీలిస్తున్న ఎస్ఈ రవీందర్

కడెం: కడెం ప్రాజెక్ట్ 2వ, నంబర్ వరద గేటుకు శుక్రవారం కౌంటర్ వెయిట్‌ను బిగించినట్లు ఇరిగేషన్ అధికారులు పేర్కొన్నారు. వరద ఉధృతికి కొట్టుకుపోకుండా డబుల్ పుల్లి సిస్టంతో కూడిన కౌంటర్‌వెయిట్‌ను అమర్చామన్నారు. కౌంటర్ వెయిట్ బిగింపుతో వరద గేట్ల మరమ్మతు పూర్తయినట్లు తెలిపారు. శుక్రవారం ప్రాజెక్ట్‌ను సందర్శించిన ఎస్ఈ రవీందర్ కౌంటర్ వెయిట్‌ను పరిశీలించారు. ఈఈ విఠల్, డీఈ భోజదాసు, ఏఈఈ రవినాయక్, తదితరులు ఉన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ



వివరాలు సేకరిస్తున్న క్లూస్ టీం సిబ్బంది

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని సోమవార్‌పేటకాలనీలో గుర్తుతెలియని వ్యక్తులు తాళం వేసిన ఇంట్లో చోరీకి పాల్పడ్డారు. వివరాలు ఇలా ఉన్నాయి.. శ్రావణి గురువారం స్థానిక బంగల్‌పేట్‌కాలనీలో తన బంధువుల ఇంట్లో జరిగిన శుభకార్యానికి వెళ్లింది. శుక్రవారం ఉదయం వచ్చి చూస్తే ఇంటి తాళం పగిలి ఉండడాన్ని గమనించి పట్టణ పోలీసులకు సమాచారం అందించారు. క్లూస్‌టీం సిబ్బంది, పోలీసులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. బీరువా, ఇతర ప్రదేశాల్లో వేలిముద్రలు సేకరించారు. రూ.10 వేల నగదును దొంగలు ఎత్తుకెళ్లారని బాధితురాలు తెలిపింది. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ ప్రవీణ్ కుమార్ పేర్కొన్నారు.

మొక్కలు భలే చౌక

- ఐటీడీఏ ఆధ్వర్యంలో మామిడి, పూలమొక్కల విక్రయాలు
- ఉమ్మడి జిల్లాలోని నర్సరీల్లో పెంపకం
- నాలుగుచోట్ల అందుబాటులోకి..

మామిడి, పూలమొక్కలు పెంపకం ఇలా..

నర్సరీ	మామిడి	క్రోటాన్స్ /పూల మొక్కలు
బెల్లంపల్లి	10,000	1,200
భీమారం	20,000	1,500
జంబుగ	5,000	500
ఉట్నూర్	10,000	2,000



నర్సరీలో మామిడి మొక్కలు

బెల్లంపల్లి: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ (ఐటీడీఏ) ఉట్నూర్ ఆధ్వర్యంలో నర్సరీల్లో పండ్ల, పూల మొక్కల పెంపకం జరుగుతోంది. క్రోటాన్స్ ఇతర రకాల అలంకరణకు సంబంధించిన మొక్కలు పెంచుతున్నారు. ఏడాది క్రితం అంటుకట్టగా మొక్కలు ఏపుగా పెరిగింది. ప్రస్తుతం ఐటీడీఏ ఉద్యానశాఖ మొక్కల విక్రయానికి సిద్ధమైంది. ఐటీడీఏకు ఆదిలాబాద్ జిల్లాలో ఉట్నూర్, మంచిర్యాల జిల్లాలోని బెల్లంపల్లి, భీమారం, కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని జంబుగ నర్సరీలు ఉన్నాయి. ప్రత్యేక శిక్షణ పొందిన సిబ్బంది ద్వారా దోశేరి, బంగెనపల్లి, తోతపురి, హిమామతి, పండ్ల రసాల మామిడి మొక్కలకు అంటు కట్టించారు. వీటికి అదనంగా మరో 5 వేల వరకు క్రోటాన్స్, అలంకరణ మొక్కలు విక్రయానికి సిద్ధంగా ఉంచారు.

లాభాపేక్ష లేకుండా..

ప్రైవేట్ నర్సరీల్లో మామిడి మొక్కల ధరలు రైతులకు ఏమాత్రం అందుబాటులో లేవు. ఒక్కో ధర రూ.150 నుంచి రూ.200 వరకు అమ్ముతున్నారు. ఇతర జిల్లాల నుంచి వీటిని కొనుగోలు చేసి తీసుకురావల్సి ఉంటుంది. పైగా రవాణా ఖర్చులు అదనం. అయితే ఉమ్మడి జిల్లా రైతులకు లాభాపేక్ష లేకుండా తక్కువ ధరకు మామిడి మొక్కలు అందించాలనే సంకల్పంతో ఐటీడీఏ ఉద్యాన అధికారులు ముందుకు సాగుతున్నారు. ఒక్కో మామిడి మొక్క రూ.50 చొప్పున, కోట్రాన్స్, అలంకరణ మొక్కలు రూ.20 చొప్పున విక్రయించాలని నిర్ణయించారు. మునగ, కరివేపాకు మొక్కలు సైతం విక్రయించనున్నారు. రైతులకు కావల్సిన ఇతర రకాల పండ్ల మొక్కలను ఇతర ప్రాంతాల నుంచి తెప్పించడానికి సిద్ధంగా ఉన్నారు.

ఎన్నాళ్లకెన్నాళ్లకు..

ఐటీడీఏ తరపున ఆయా ప్రాంతాల్లో దశాబ్దాల క్రితం నర్సరీలు ఏర్పాటు చేశారు. ఒక్కో నర్సరీ పరిధిలో కనిష్టంగా 50 నుంచి గరిష్టంగా 150 ఎకరాల భూములు ఉన్నాయి. మామిడి, సపోటా, జామ, దానిమ్మ, అల్లనేరేడు, సీతాఫలం, నిమ్మ, రేగు, బొప్పాయి తదితర రకాల మొక్కలు పెంచి విక్రయాలు చేశారు. కాలక్రమేణా నర్సరీల నిర్వహణ గాడి తప్పడం, అధికారుల అవగాహన రాహిత్యంతో చాలామటుకు నర్సరీలు కళ తప్పి ఉన్నాయి. ప్రస్తుత ఐటీడీఏ పీవో ఖుష్బు గుప్తా, హార్టికల్చర్ అధికారుల చొరవతో ఉమ్మడి జిల్లాలోని నాలుగు నర్సరీల్లో ప్రస్తుత ఏడాది నుంచి ప్రయోగాత్మకంగా మళ్లీ మామిడి ఇతర రకాల మొక్కల పెంపకానికి శ్రీకారం చుట్టారు. తద్వారా నర్సరీలు పచ్చదనంతో పండ్లు, పూలమొక్కలతో కనువిందు చేస్తున్నాయి.

రైతుల ఆసక్తి

మంచిర్యాల, ఆసిఫాబాద్ జిల్లాల భూములు మామిడి తోటల పెంపకానికి ఎంతో సారవంతంగా ఉన్నాయి. నిర్మల్, ఆదిలాబాద్ జిల్లాల్లో అంతగా అనువైన భూములు లేవు. అక్కడక్కడ కొద్దిపాటి ఎకరాల్లో ఔత్సాహిక రైతులు మామిడి పెంపకం చేస్తున్నారు. మంచిర్యాల జిల్లా రైతులు ఇటీవల మొక్కల కొనుగోళ్ల కోసం ఉద్యానశాఖ అధికారులను సంప్రదించారు. ఉపాధి హామీ పథకం ద్వారా మొక్కలు సరఫరా చేయడానికి ఈజీఎస్ అధికారులు ముందుకు వస్తున్నట్లుగా తెలుస్తోంది. మరోపక్క వరంగల్, భూపాలపల్లి, కరీంనగర్ జిల్లాల నుంచి మొక్కల కోసం ఆర్డర్లు వస్తున్నాయని అధికారులు చెబుతున్నారు.

నాణ్యతతో పెంచుతున్నాం



నర్సరీల్లో మామిడి మొక్కలు పది రకాల వరకు ఉన్నాయి. ఎంతో నాణ్యతతో వీటిని పెంచుతున్నాం. రైతుల స్పందన తర్వాతే వచ్చే ఏడాది నుంచి మరిన్ని మొక్కలు పెంచుతాం. జిల్లాల నుంచి పలువురు మొక్కల కోసం సంప్రదిస్తున్నారు. నాణ్యత మొక్కలు తక్కువ ధరకు లభిస్తుండటంతో కొనుగోలు ఆసక్తి చూపుతున్నారు.

– సందీప్‌కుమార్, ప్రాజెక్టు ఉద్యాన అధికారి, ఉట్నూర్

పకడ్బందీగా 'మహా అభియాన్' అమలు

- ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా



మాట్లాడుతున్న ఖుష్బూ గుప్తా

ఉట్నూర్‌రూరల్: ప్రధానమంత్రి జన జాతీయ న్యాయ మహాఅభియాన్ పథకాన్ని పకడ్బందీగా అమలు చేయాలని ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా పేర్కొన్నారు. ఉట్నూర్ కేబీ కాంప్లెక్స్‌లోని సమావేశ మందిరంలో పీవీటీజీ సంఘ నేతలతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ ఈ పథకం ద్వారా ఒక్కో జిల్లాకు పీవీటీజీ గ్రామాలకు 5 చొప్పున అంబులెన్స్‌లు ఏర్పాటు చేశామన్నారు. విద్యుత్ కోసం సోలార్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జైనూర్, నార్నూర్ మండలాల్లోని పీవీటీజీ గ్రామాలను గుర్తించి వాటర్ ట్యాంకర్ అందించినట్లు పేర్కొన్నారు. నైపుణ్య అభివృద్ధి సంస్థ ద్వారా ఉమ్మడి జిల్లా యువతకు శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పిస్తామన్నారు. విద్యార్థులు పెంచికల్‌పేటలో కొబ్బరి సాగులో శిక్షణ పొందవచ్చన్నారు. ఐటీడీఏ ఆధ్వర్యంలో పూల మొక్కలు, పండ్ల మొక్కలు అందిస్తామన్నారు. సమావేశంలో ఏడీఎంవో మనోహర్, ఏపీవో పీవీటీజీ ఆత్రం భాస్కర్, పీహెచ్ఓ సందీప్‌కుమార్, జేడీఎం నాగ భూషణం, పీవీటీజీ సంఘ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

చోరీకి గురైన వాహనాలు రికవరీ



స్వాధీనం చేసుకున్న వాహనాలతో పోలీసులు

ఆదిలాబాద్‌టౌన్: ఇటీవల చోరీకి గురైన ఆటో, మోటారు సైకిల్‌ను టూటౌన్ పోలీసులు దొంగల నుంచి రికవరీ చేశారు. సీఐ కరుణాకర్‌రావు కథనం ప్రకారం..మహారాష్ట్రలోని కిన్వాట్ తాలుకా మాండ్వా గ్రామానికి చెందిన దొడివార్ రాజేశ్వర్ ఆదిలాబాద్‌లో నిర్మల్‌కు చెందిన ఫిరోజ్‌ఖాన్ ఆటోను, భీంపూర్ మండలం పిప్పల్‌కోటికి చెందిన భూమన్న మోటార్‌సైకిల్‌ను రిమ్స్ ఆస్పత్రి నుంచి దొంగలించాడు. బాధితుల ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేపట్టిన పోలీసులు దొంగను అదుపులో తీసుకుని విచారించగా నేరం ఒప్పుకున్నాడు. వాహనాలు స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లుగా పేర్కొన్నారు. నిందితుడిని పట్టుకున్నవారిలో టూటౌన్ సీఐ, ఐడీ పార్టీ పోలీసులు నరేశ్, రమేశ్, క్రాంతి, నరేందర్, హరింద్రనాథ్, ప్రవీణ్, యూసుఫ్‌అలీ, కిషన్ తదితరులు ఉన్నారు.

అదనపు కట్నం కేసులో ఇద్దరికి ఏడేళ్ల జైలు

సారంగపూర్:అదనపు కట్నం కేసులో భర్త, మామకు ఏడేళ్ల కఠిన కారాగార జైలుశిక్షతోపాటు చెరో రూ.6వేల జరిమానా విధిస్తూ జిల్లా సెషన్స్‌కోర్టు న్యాయమూర్తి కరుణకుమార్ శుక్రవారం తీర్పునిచ్చారు. ఎస్సై శ్రీకాంత్ కథనం ప్రకారం.. మండలంలోని ధని గ్రామానికి చెందిన చేపూరి శ్రీనివాస్‌కు, దిలావర్‌పూర్ మండలం బన్సపెల్లి గ్రామానికి చెందిన సౌమ్యతో 2016లో వివాహమైంది. రూ.లక్ష నగదు, మూడు తులాల బంగారం కట్నకానుకలు ఇచ్చారు. పెళ్లయిన నెల తర్వాత రూ.50 వేలు అదనపు కట్నం తేవాలని భార్యపై ఒత్తిడి చేశాడు. భర్త శ్రీనివాస్, అతని తండ్రి వెంకటస్వామి ఆమెను వేధించసాగారు. 2019 అక్టోబర్ 8న ధని గ్రామంలో తన ఇంట్లో సౌమ్య ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి అన్న నర్సయ్య ఫిర్యాదుతో అప్పటి ఎస్సై యూనుస్ అహ్మద్, డీఎస్పీ ఉపేందర్ రెడ్డిలు కేసు దర్యాప్తు చేపట్టారు. కోర్టులో సాక్షులను ప్రవేశపెట్టి పీపీ కల్వకుంట్ల వినోద్‌రావు నేరం రుజువు చేశారు. ఈ మేరకు న్యాయమూర్తి తీర్పు చెప్పారు. నిందితులకు శిక్షపడేలా చేసిన లైజనింగ్ అధికారి డల్లుసింగ్, కోర్టు కానిస్టేబుల్ రాజేందర్‌ను ఎస్పీ జానకీషర్మిల అభినందించారు.

ఉరేసుకుని డిగ్రీ విద్యార్థి ఆత్మహత్య



సిడాం అశోక్(ఫైల్)

పెంచికల్‌పేట్: మండలంలోని అగర్‌గూడ గ్రామంలో డిగ్రీ విద్యార్థి సిడాం అశోక్ (23) ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు, ఎస్సై కొమురయ్య కథనం ప్రకారం.. సిడాం శంకర్, యశోద దంపతుల కుమారుడు అశోక్ మంచిర్యాల పట్టణంలో డిగ్రీ కళాశాలలో ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. కొన్నిరోజుల క్రితం కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలకు నిర్వహించిన జీడీ ఫలితాలు రాగా.. ఎంపిక కాలేదు. అప్పటి నుంచి తీవ్ర మనస్తాపంతో ఉన్నాడు. గురువారం అర్ధరాత్రి ఇంటి పక్కనే ఉన్న పాకలో దూలానికి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. అందరితో కలిసిమెలిసి ఉండే అశోక్ మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. తండ్రి శంకర్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

మద్యానికి బానిసై ఒకరు..

కుభీర్: మద్యానికి బానిసై ఒకరు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై పి.రవీందర్ కథనం ప్రకారం.. మండలంలోని చాతా గ్రామానికి చెందిన చందుల సాయులు (55) మద్యానికి బానిసయ్యాడు. బాసర మండలంలోని చౌట గ్రామంలో ఆయన అత్త గురువారం మృతిచెందింది. విషయం తెలిసిన వెంటనే భార్య, కుమారుడు అక్కడికి వెళ్లారు. చాతా గ్రామంలో ఉదయం తన ఇంట్లో ఎవరూ లేకపోవడంతో మద్యం మత్తులో ఉన్న సాయులు గుర్తుతెలియని పురుగుల మందు తాగి కింద పడిపోయాడు. ఇరుగుపొరుగు వారు గమనించి భైంసాకు తరలించారు. వైద్యుల సూచనతో మెరుగైన వైద్యం కోసం నిజామాబాద్‌కు పంపించారు. చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం మృతి చెందాడు. మృతుడి కుమారుడు అంజయ్య ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి భార్య ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు.



మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

గడ్డి మందు తాగి యువకుడు..



సుమన్(ఫైల్)

దండేపల్లి: మండలంలోని లింగాపూర్‌కు చెందిన యువకుడు జరుపుల సుమన్ (31) గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై ఉదయ్‌కిరణ్ కథనం ప్రకారం.. తాళ్లపేటలో వాటర్‌ప్లాంట్ నిర్వహిస్తున్న సుమన్ అదే గ్రామానికి చెందిన నిజాం వద్ద డబ్బులు తీసుకున్నాడు. ఇచ్చిన డబ్బులు తిరిగి చెల్లించాలని, లేదంటే ప్లాంట్‌కు తాళం వేసి, ఆటో తీసుకెళ్తానని నిజాం అన్నాడు. దీంతో మనస్తాపం చెందిన సుమన్ గురువారం లింగాపూర్‌లోని ఇంటికి వస్తూ మధ్యలో గడ్డిమందు తాగాడు. ఇంటికి చేరుకోగానే వాంతులు చేసుకున్నాడు. ఏమైందని భార్య అడిగితే విషయం చెప్పాడు. అతన్ని లక్సెట్టిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లి ప్రథమ చికిత్స అందించారు. మెరుగైన వైద్యం కోసం మంచిర్యాలకు, అక్కడి నుంచి నిర్మల్ తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. భార్య మమత ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రీల్స్ చేస్తూ..దోపిడీకి పాల్పడుతున్న ముగ్గురి అరెస్టు

- ఒంటరిగా వెళ్తున్న వ్యక్తులే టార్గెట్
- నకిలీ తుపాకీతో బెదిరిస్తున్న ముఠా
- వాహనాల తనిఖీ చేస్తుండగా పట్టుకున్న పోలీసులు
- వివరాలు వెల్లడించిన ఎస్పీ జానకీ షర్మిల



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ జానకీ షర్మిల

నిర్మల్‌టౌన్: మరణాయుధాలతో రీల్స్ చేస్తూ..మాఫియాగా సంచరిస్తూ.. దొంగతనాలకు పాల్పడుతున్న కూలీ పని చేసుకునే ముగ్గురు యువకులను పట్టణ పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. జిల్లా ప్రధాన పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎస్పీ జానకీ షర్మిల ఈ మేరకు వివరాలు వెల్లడించారు. జిల్లాకేంద్రానికి చెందిన అవేజ్ చాహుస్, షేక్ మతీనొద్దీన్, షేక్ ఆదిల్ స్నేహితులు. ఇన్‌స్టాగాం వేదికగా చేసుకుని మతీనొద్దీన్ మాఫియా పేజీని క్రియేట్ చేశాడు. ఇతడు గతంలో మొబైల్ చోరీ కేసులో నిందితుడిగా ఉన్నాడు. షేక్ ఆదిల్ హైదరాబాద్‌లో గుర్తుతెలియని వ్యక్తి వద్ద తుపాకీ కొనుగోలు చేశాడు. ముగ్గురు జల్సాలకు అలవాటుపడి సులభంగా డబ్బులు సంపాదించేందుకు ముఠాగా ఏర్పడ్డారు. జన సంచారం లేని ప్రదేశంలో జంటలు, రాత్రివేళలో ఒంటరిగా వెళ్లేవారు, బస్టాండ్‌లో తలదాచుకుంటున్న వారిని నకిలీ తుపాకీతో బెదిరించి అందినకాడికి దోచుకుంటున్నారు.

స్కూటీపై వస్తూ.. పారిపోతూ..

నిర్మల్‌లోని శివాజీచౌక్ వద్ద ఎస్సై శుక్రవారం వాహనాలు తనిఖీ చేస్తుండగా.. ఇద్దరు స్కూటీపై వస్తూ.. పోలీసులను చూసి పారిపోయారు. అనుమానంతో వెంబడించి శ్యాంఘడ్ వద్ద అవేజ్ చాహుస్, షేక్ మతీనొద్దీన్, షేక్ ఆదిల్‌ను అదుపులో తీసుకుని విచారించారు. దీంతో అసలు విషయం బయటపడింది. వీరి వద్ద నుంచి నకిలీ తుపాకీ, ఒక బైక్, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

సోషల్ మీడియాపై నిఘా

జిల్లాలో సోషల్ మీడియాపై 24 గంటల నిఘా పెట్టడానికి ప్రత్యేక ఐటీ సెల్ ఏర్పాటు చేసినట్లు ఎస్పీ జానకీ షర్మిల తెలిపారు. ఎస్పీ మాట్లాడుతూ మాజంలో అలజడి సృష్టించేలా పోస్టులు పెట్టినా, షేర్ చేసినా చట్టరీత్యా చర్యలు ఉంటాయని హెచ్చరించారు. సమావేశంలో నిర్మల్ డీఎస్పీ గంగారెడ్డి, పట్టణ, రూరల్ సీఐలు ప్రవీణ్‌కుమార్, శ్రీనివాస్, హెడ్ కానిస్టేబుల్ జైకిస్టు, కానిస్టేబుళ్లు గణేశ్, విజయవర్మ తదితరులు పాల్గొన్నారు.

కాలినడక.. ఆటో.. ఆస్పత్రికి గర్భిణి

ఆశ వర్కర్ కనకలక్ష్మితో బయల్దేరిన గర్భిణి శ్రీదేవి



ఆటోలో వెళ్తున్న కనకలక్ష్మి, శ్రీదేవి



ఇంద్రవెల్లి: రోడ్డు, రవాణా సౌకర్యం లేక వర్షాకాలంలో గర్భిణులు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ఈ క్రమంలో గర్భిణులను 15నుంచి 20రోజుల ముందే ఆస్పత్రికి సమీపంలోని బంధువుల ఇళ్లు, ఆస్పత్రిలో చేర్పించి ప్రసూతి చేయించిన సంఘటనలు ఉన్నాయి. మండలంలోని గౌరపూర్ గ్రామ పంచాయతీ పరిధి చిత్తబట్ట గ్రామస్తులు వర్షాకాలంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోడ్డు, మధ్యలో ఉన్న వాగుపై కల్వర్టు లేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. శుక్రవారం గ్రామానికి చెందిన గర్భిణి పంద్ర శ్రీదేవి ప్రసవ సమయం సమీపించడంతో ఆశవర్కర్ కనకలక్ష్మి సాయంతో గ్రామం నుంచి కాలినడకన రెండు కిలోమీటర్లు వెళ్లింది. అక్కడి నుంచి ఆటోలో ఉట్నూర్ ప్రభుత్వ ఆస్పత్రికి చేరుకుంది. ఆశ వర్కర్ ఆమెను ప్రసవ సమయానికి 15 రోజుల ముందే ఆస్పత్రిలో చేర్పించింది. దీర్ఘకాలిక అనారోగ్యంతో బాధపడుతున్న వారినీ వర్షాకాలంలో బంధువుల ఇళ్లకు తరలించి వైద్యం అందేలా జాగ్రతలు తీసుకుంటున్నామని గ్రామస్తులు తెలిపారు. అధికారులు స్పందించి చిత్తబట్ట గ్రామానికి రోడ్డు, వాగు వద్ద కల్వర్టు నిర్మించాలని కోరుతున్నారు.

ప్రమాదవశాత్తు చెరువులో పడి ఒకరు మృతి



మర్రి ఆశన్న (ఫైల్)

నర్సాపూర్(జి): మద్యం మత్తులో ఒకరు ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెందాడు. ఎస్సై హన్మాండ్లు కథనం ప్రకారం.. మండలంలోని కుస్లీ గ్రామానికి చెందిన మర్రి ఆశన్న (52) పశువుల కాపరిగా జీవనం సాగిస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఇటీవల మద్యానికి బానిసై పనికి వెళ్లడం లేదు. గురువారం సాయంత్రం నుంచి కనిపించకపోవడంతో భార్య లక్ష్మి ఫిర్యాదుతో పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు. కాగా, ఆశన్న మద్యం మత్తులో గ్రామంలోని ఎల్లమ్మ చెరువులో పడ్డాడు. చెరువు ఒడ్డున చెప్పులు, లుంగీ, టవల్, లైటర్ వస్తువులను శుక్రవారం స్థానికుడు గమనించాడు. కుటుంబీకులకు సమాచారం అందించారు. పోలీసులు అక్కడికి చేరుకుని చెరువులో గజఈతగాళ్లతో గాలించగా మృతదేహం లభించింది. పోస్టుమార్టం నిమిత్తం భైంసా ఏరియాస్పత్రికి తరలించారు. భార్య ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

డీఎస్సీ నోటిఫికేషన్‌పై న్యాయపోరాటం

నార్నూర్: ఏజెన్సీ రిజర్వేషన్ అమలు చేయకుండా డీఎస్సీ నోటిఫికేషన్ ఇవ్వడంపై హైకోర్టులో కేసు వేసి న్యాయపోరాటం చేస్తున్నామని జైభారత్ జిల్లా అధ్యక్షుడు పెందూర్ దీపక్ తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వం డీఎస్సీ జనరల్ నోటిఫికేషన్ జారీ చేయడంపై హైకోర్టులో కేసు వేశామన్నారు. గురువారం మేజిస్ట్రేట్.. ఏజెన్సీ ప్రాంతాన్ని దృష్టిలో పెట్టుకుని ఎంపిక ప్రక్రియను నిలిపివేయాలన్నారు. తీర్పు వెలువడ్డాకే ఎంపిక ప్రక్రియ జరపాలని ఉత్తర్వులు జారీ చేశారని పేర్కొన్నారు. 8 వారాల్లోపు కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించినట్లు తెలిపారు. ఆయన వెంట నాయకులు సోమేశ్ ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో విలేకరి దుర్మరణం



గంగారెడ్డి (ఫైల్)

తానూరు: మండలంలోని హంగిర్గా సమీపంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో విలేకరి దుర్మరణం చెందాడు. ఎస్సై సందీప్ కథనం ప్రకారం.. ఎల్వి గ్రామానికి చెందిన యాతాలం గంగారెడ్డి(38) శుక్రవారం పని నిమిత్తం బైక్‌పై భైంసా వెళ్లి తిరుగు పయనమయ్యాడు. మార్గమధ్యలో గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి, సీఐ మల్లేశ్ వేర్వేరుగా ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. భార్య వైశాలి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి కుమార్తె ఉంది.



'గుంజాల'కు జలకళ

తాంసి: భీంపూర్ మండలం గుంజాల జలపాతానికి జలకళ సంతరించుకుంది. వరుసగా కురుస్తున్న వర్షాలకు వాగులు, చెరువుల నుంచి వరదనీరు చేరింది. జలపాతం పైనుంచి వర్షపు నీరు రావడంతో చూపరులను ఆకట్టుకుంటుంది. పచ్చని చేన్ల మధ్యలో ఈ జలపాతం అందాలను పర్యాటకులు వీక్షిస్తుంటారు.